
సాక్షి
కృష్ణాజిల్లా
ఆదివారం । 26 । జనవరి । 2025



క్వార్టర్ ఫైనల్స్‌కు ఆంధ్రా జట్లు

సెపక్‌తక్రా బాల, బాలికల పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్లు సత్తా చాటుతున్నాయి. లీగ్ దశ పోటీలు శనివారం ముగిశాయి. బాల, బాలికల జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి. -IIలో▸



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 556.20 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,221 క్యూసెక్కులు విడుదలవుతోంది.



మిర్చి రైతులను ఆదుకోవాలి

వత్సవాయి: మండలంలోని మక్కపేటలో తెగుళ్ల బారినపడిన మిర్చి తోటలను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ శనివారం పరిశీలించారు.

న్యూస్‌రీల్

కలెక్టర్ బాలాజీకి బెస్ట్ ఎలక్టోరల్ అవార్డు



చిలకలపూడి(మచిలీపట్నం): బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డును 2024 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా కలెక్టర్ డీకే బాలాజీ అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణ, తప్పులు లేని, కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించడంలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అవార్డుకు ఆయన్ను ఎంపిక చేసింది.

31న స్వాధీనం చేసుకున్న బియ్యం బహిరంగ వేలం

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజాపంపిణీ వ్యవస్థలో 6ఏ కేసుల్లో స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని బహిరంగ వేలం వేస్తామని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసుల్లో ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న 739.11 క్వింటాళ్ల ప్రజాపంపిణీ బియ్యాన్ని తన సమక్షంలో ఈ నెల 31వ తేదీ ఉదయం 10.30 గంటలకు కార్యాలయం వద్ద బహిరంగ వేలం జరుగుతుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు 30వ తేదీ జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో ఉన్న శాంపిల్ బియ్యాన్ని పరిశీలించుకుని 31వ తేదీలోగా డిపాజిట్ రూ. 50 వేలను జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారికి చెల్లించి నిర్ణీత నమూనాలో దరఖాస్తులు సమర్పించి వేలంలో పాల్గొనాలని వివరించారు. వేలంలో పాల్గొనేవారు జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, దరావత్తు సొమ్ము వేలంపాట సమయంలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. 6ఏ కేసులు నమోదై పెండింగ్‌లో ఉన్న వారు వేలంపాటలో పాల్గొనేందుకు అనర్హులని జేసీ స్పష్టం చేశారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయాలని వినతి



విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలో న్యాయవాదులపై పోలీసులు పాల్పడుతున్న వరుస దాడులను నియంత్రించి ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను సమర్థంగా అమలు చేయాలని డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావును బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి కోరారు. డీజీపీ ద్వారకాతిరుమలరావును ఆయన కార్యాలయంలో బీబీఏ కార్యదర్శి అరిగల శివరామప్రసాద్(రాజా), సభ్యుడు చక్రవర్తితో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సోషల్ ఇంజినీర్లుగా పని చేస్తున్న న్యాయవాదులపై పోలీసులు దాడులు పాల్పడటం దురదృష్టకరమని పేర్కొన్నారు. న్యాయవాదులతో పోలీస్ వ్యవస్థ స్నేహభావంతో మెలగాలని, సమానత్వంతో శాంతిభద్రతలను పరిరక్షించాలని డీజీపీని కోరారు.

పదో తరగతి విద్యార్థులకు నగదు బహుమతి



జి.కొండూరు: మండలంలోని వెలగలేరు చనమోలు పకీరాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు చనమోలు లక్ష్మీకాంతమ్మ, వెంకటరామయ్య మెమోరియల్ ట్రస్టు నుంచి శనివారం రూ.1.75 లక్షలను నగదు బహుమతి అందజేశారు. పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 29 మంది విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.పద్మ, చనమోలు అనిల్‌కుమార్(బాబ్జి), ట్రస్టు నిర్వాహకులు చనమోలు శ్రీధర్, నాగమల్లేశ్వరరావు, రామ్మోహన్‌రావు, సీతారావమ్మ పాల్గొన్నారు.



విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియానికి జాతీయ జెండాలతో అలంకరణ



వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శన నిమిత్తం ఏర్పాటుచేసిన స్టాల్స్

గణతంత్ర వేడుకలకు సిద్ధం

బందరులో ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్

కోనేరుసెంటర్: గణతంత్ర వేడుకలకు బందరులో పోలీస్ పరేడ్ గ్రౌండ్ సిద్ధమైంది. కార్యక్రమ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు దగ్గరుండి చూసుకున్నారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కలెక్టర్ నిర్ణయించడంతో పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు రెండు రోజుల ముందు నుంచే ఏర్పాట్లను ముమ్మరం చేశారు. శనివారం సాయంత్రానికి మైదానాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. తెల్లటి షామియానాలు వేసి నేలను చదును చేయించారు. విద్యార్థులు కార్యక్రమాలను తిలకించడానికి ప్రత్యేకంగా షామియానాలతో పాటు కుర్చీలు వేయించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాలను వీక్షించేందుకు సకల ఏర్పాట్లు చేశారు. ఆహూతులు, విద్యార్థులకు అవసరమైన తాగునీటి వసతి కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

కోనేరుసెంటర్: గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేయాలని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించే 76వ గణతంత్ర వేడుకలకు జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లు ఉండాలన్నారు. వీవీఐపీ, వీఐపీ, పబ్లిక్, జిల్లా అధికారులకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాట్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, అనంతరం పోలీస్ దళాలతో గౌరవ వందన స్వీకరణ, అనంతరం సందేశం ఉంటుందన్నారు. 9.35 గంటలకు ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన ఉంటుందని వివరించారు. అనంతరం ఉదయం 10 గంటలకు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడానికి స్టాల్స్ సందర్శన ఉంటుందన్నారు.

అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేత, అనంతరం 11:45 నిమిషాలకు వందన సమర్పణతో కార్యక్రమం ముగుస్తుందన్నారు. ఏర్పాట్లలో లోపాలు లేకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖర రావు, అడిషనల్ ఎస్పీలు బి. సత్యనారాయణ, ఎస్వీ నాయుడు, ఇతర అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ



వేడుకలకు ముస్తాబైన్ పోలీస్ పరేడ్ గ్రౌండ్

దేశభక్తికి చిరునామా 'పింగళి'

- నిరుపేదగానే తుదివరకు
- ఎవరైనా సాయం చేసేందుకు వస్తే.. సున్నితంగా వద్దనేవారు
- డైరీ రాయించడం మరువలేను
- పింగళి మనవడు నరసింహం మనోగతంతో కథనం



చల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పింగళి వెంకయ్య విగ్రహం

సాక్షి, మచిలీపట్నం: ఏటా పంద్రాగస్టు.. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మూడు రంగుల జెండా రెపరెపలాడుతుంది. ఈ రెండు జాతీయ జెండా పండగల రోజున రెపరెపలాడే తిరంగాను రూపొందించింది మన తెలుగు వారు కావడం గర్వకారణం. పెదకల్లేపల్లిలో పుట్టిన మువ్వన్నెల జెండా రూపకర్త పింగళి వెంకయ్య ఓనమాలు దిద్దింది దివిసీమలోనే. స్వాతంత్ర్య పోరాటంలో జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్న ఆయన.. జాతీయ జెండాను రూపొందించి అంతర్జాతీయంగా ఖ్యాతిగాంచారు. నేడు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పింగళి మనవడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ జీవీఎస్ నరసింహం మనోగతంతో కథనం..

గుండె నిండా దేశభక్తి..

మా తాతయ్య గారికి గుండె నిండా దేశభక్తి. అదే లక్ష్యంతో మిలటరీలో చేరారు. నిస్వార్థంగా స్వాతంత్ర్య పోరాటంలో, ప్రజలను చైతన్య పరిచే సభల్లో పాల్గొన్నారు. అదే ఆలోచనతో జాతీయ జెండాను ఆవిష్కరించారు. సామాన్య జీవితమే గడిపారు. దేశం నుంచి ఏదీ ఆశించలేదు.

పింగళి తాతయ్య మృదుస్వభావి

తాతయ్యకు మా అమ్మ ఘంటసాల సీతామహాలక్ష్మి ఏకైక కుమార్తె. పరశురామయ్య, వెంకట చలపతి రావు కుమారులు. అమ్మకు సొంత ఊరు యార్లగడ్డలోనే వివాహం చేశారు. తరచూ తాతయ్య ఇంటికి వెళ్లేవాడిని. మిలటరీలో పనిచేయడంతో ఆయన వద్దకు వెళ్లేందుకు జంకు ఉండేది. ఆయన ప్రేమగా పలకరించేవారు. మంచి, చెడు.. సమాజం, దేశభక్తిపై చెప్పేవారు.



పింగళి కూతురు, కుటుంబ సభ్యులతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

చివరి రోజుల్లో పూరి పాకలో..

తాతయ్య, అమ్మమ్మ రుక్మిణమ్మ చివరి రోజుల్లో విజయవాడలోని పాల ఫ్యాక్టరీ సమీపంలో ఓ పూరి పాకలో గడిపారు. విపత్తు కారణంగా మూడుసార్ల ఆ పాక నేలమట్టమైంది. ఆయన గురించి తెలిసి, ఎవరైనా సాయం చేద్దామని వస్తే తిరస్కరించేవారు.

డైరీ రాయించేవారు

మా తాతయ్య విజయవాడలో ఉన్నా.. పండగ, సెలవు రోజుల్లో వెళ్లే వాళ్లం. పూరిపాక అయినా.. హుందాగా ఉండేవారు. ఆయన రోజూ డైరీ రాసేవారు. చివరిలో రోజుల్లో డైరీ రాయడానికి ఆయన శరీరం సహకరించకపోతే నాతో, మా అన్నయ్య దేవకీనందన నరసింహంతో రాయించేవారు. అది మరిచిపోలేను. తాతయ్య వాస్తవ జన్మదినం 1878. చాలా చోట్ల 1876 అని ఉంది.

భారతరత్న ఇవ్వాలని మాజీ సీఎం జగన్ లేఖ

మూడేళ్ల క్రితం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో నాటి సీఎం వైఎస్ జగన్ మా ఇంటికి వచ్చారు. అమ్మను సన్మానించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. త్రివర్ణ పతాక రూపకర్తకు భారతరత్న ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశారు. 2022 ఆగస్టు 2న తాతయ్య 145 జయంతి సందర్భంగా మా అమ్మను సన్మానించేందుకు ఢిల్లీకి రావాలని కేంద్రం ఆహ్వానించింది. జూలై 21న అమ్మ మరణించారు. నేను, మా తమ్ముడు, రెండో కుమారుడు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్ రెడ్డిల నుంచి సత్కారాన్ని అందుకున్నాం. కార్యక్రమాలతో తెలుగువారైన పింగళి తాతయ్యగారి ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది.

పూజకు అర్చకులు కరవు!

- పూజారుల కుటుంబాలు వలసబాట
- దిక్కులేక ట్రస్టీలే దీపారాధనలు చేస్తున్న వైనం
- చదువులు, ఉద్యోగాలపైనే దృష్టి
- ఉమ్మడి కృష్ణాలో 20 వేలకు పైగా అర్చక కుటుంబాలు
- 2,600 పైచిలుకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆలయాలు

గుడ్లవల్లేరు: భగవంతుడికి భక్తులకు అనుసంధానమైనవారు పూజారులు. అలాంటి పూజారులను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అవస్థ పడుతున్నారు. పలుచోట్ల గుళ్లలో పూజారులు లేక ట్రస్టీలే దీపారాధనలు చేస్తున్న పరిస్థితి ఎదురవుతోంది. చాలీచాలని వేతనాలతో పూజారుల కుటుంబాలు గడవక పట్టణాలకు వలస బాట పడుతున్నారు. పిల్లలైతే చదువులు, పెద్దలైతే వచ్చిన ఉద్యోగాల పైనే ఆధార పడుతున్నారు. వేద పాఠశాలలకు ఆదరణ కరువై అర్చకత్వానికి అనాసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. ఏపీలో జిల్లాకు ఒకటి చొప్పున వేద పాఠశాలలను నిర్వహించడానికి న్యాయస్థానాల నుంచి కూడా ప్రభుత్వాలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కానీ వాటిపై దృష్టి సారించడం లేదు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో పొరుగు రాష్ట్రాల నుంచి పూజారులను దిగుమతి చేసేందుకు కొందరు కబుర్లు చేస్తున్నారు.

600లోపు ఆలయాలకే..

ఉమ్మడి కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో 20వేల పైచిలుకు పూజారుల కుటుంబాలు ఉన్నాయి. 2,600 పైగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆలయాలు ఉన్నాయి. దేవదాయ శాఖలో 1,200 ఆలయాలకు పైబడి ఉంటే...అందులో రూ.15లక్షల లోపు ఆదాయం ఉన్న ఆలయాలను సీ క్లాస్‌గా, రూ.15లక్షల నుంచి రూ.50లక్షల లోపున్న వాటిని బీ క్లాస్, రూ.50 లక్షలు పైబడిన వాటిని ఏ క్లాస్‌గా దేవదాయ శాఖ పరిగణించింది. వీటిలో రూ.లక్ష లోపు ఆదాయం రానటువంటి ఆలయాలే ఎక్కువగా ఉన్నాయి. అందులో కేవలం 600 లోపు ఆలయాలకే కూటమి ప్రభుత్వం ధూప, దీప నైవేద్యాలకు నిధులు ఇస్తోంది.

అర్చకుల కొరత

దేవస్థానాలకు అర్చకుల కొరత ఏర్పడింది. కొత్త తరం వారు ఈ రంగానికి రావడానికి ససేమిరా అంటున్నారు. ప్రస్తుతం అర్చకులుగా చేసే కుటుంబాల వారు తమ పోషణ నిమిత్తం పట్టణాల్లో ఏదో ఒక ఉద్యోగం చేసుకునేందుకు వలసల బాట పడుతున్నారు.



కొతవరంలో చెన్నకేశవ ఆలయం



పూజలు చేస్తున్న అర్చకుడు(ఫైల్)

స్థానికేతర పూజారులే దిక్కు

స్థానికంగా పౌరోహిత్యంపై అనాసక్తి పరచడంతో మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల నుంచి పూజారులను ఇక్కడి ఆలయాల్లో కార్యక్రమాలకు పిలిపించుకుంటున్నారు. ఇళ్లలో శుభ కార్యాలకు కూడా ఈ పూజారులను కబుర్లు పెడుతున్నారు. ఎంతమంది ఉన్నా.. పెళ్లిళ్ల సీజన్‌లో మాత్రం పురోహితులు కొరత తప్పటం లేదు.

గత వైఎస్సార్ సీపీ హయాంలో..

అర్చకుల గృహ నిర్మాణాలకు సీజేఎఫ్ లేక అర్చక సంక్షేమ నిధులను అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అర్చకులకు వేతనాలను పెంపొందించింది. అన్యాక్రాంతంలో ఉన్న దేవదాయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకున్నారు. ఓపిక ఉన్నంత వరకు అర్చకత్వం చేయొచ్చనే అవకాశం ఇచ్చారు. వైఎస్‌జగన్ హయాంలో 2,750 దేవాలయ నిర్మాణాలను చేపట్టారు.


ఒక్కో అర్చకుడికి మూడేసి గుళ్లు



మూడేసి ఆలయాల్లో ఒక్క పూజారే స్వామివార్లకు పూజాదికాలు నిర్వహిస్తున్నారు. కేవలం అర్చకుల కొరతతో ఈ పరిస్థితి నెలకొంది. వేతనాలు చాలక.. కుటుంబాల పోషణ చేసుకోలేక అర్చకత్వానికి దూరమవుతున్నారు. అర్చకులు లేక ట్రస్టీలు కూడా దీపారాధనలు చేస్తున్నారు. ఆ చర్యలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాం.

– డాక్టర్ అగ్నిహోత్రం ఫణిగోపాల్, అర్చక సమాఖ్య అధ్యక్షుడు, కృష్ణా

అర్చకుల ఆకలి కేకలు



అర్చకుల కుటుంబాల్లోని ఆకలి కేకలు ఎవరికీ పట్టడం లేదు. అందుకే అర్చకులు వలసల బాట పడుతున్నారు. ఈనాడు ఆలయాల్లో దైవాలకు నైవేద్యం పెట్టే దిక్కే కరువైంది. జిల్లాకు ఒక వేద పాఠశాలను నిర్వహించాలనే కోర్టు ఉత్తర్వులను సైతం ప్రభుత్వాలు పక్కన పెట్టేస్తున్నాయి. ఆదరణ లేక పౌరోహిత్యంపై అర్చక కుటుంబాలు అనాసక్తి చూపుతున్నాయి.

– అగ్నిహోత్రం ఆత్రేయబాబు, అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

2 నుంచి మోపిదేవిలో బ్రహ్మోత్సవాలు



మోపిదేవి ఆలయంలో కార్తికేయుడు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 2 నుంచి 6వ తేదీ వరకు ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు.

ముడుపుల వృక్షం

ఆలయ ప్రాంగణంలో శతాబ్దాల నాటి నాగమల్లి వృక్షం ఉంది. నాగమల్లి వేయి పడగలతో లోపల లింగాకారంతో ప్రకాశిస్తుంది. ఏడాదికి రెండు సార్లు మాత్రమే పువ్వులు విచ్చుకుంటాయి. భక్తులు కోర్కెలు తీర్చాలని కోరుతూ వృక్షానికి ముడుపులు కడతారు. పిల్లల కోసం మహిళలు ఊయల కడుతుంటారు. ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలుపోసిన తర్వాత స్వామివారిని దర్శించుకోవడం విశేషం.

పుష్కరిణిలో తొలిసారిగా తెప్పోత్సవం

దేవాలయలంలోని కోనేరులో తొలిసారిగా స్వామివారి తెప్పోత్సవానికి దేవదాయశాఖ శ్రీకారం చుట్టింది. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు 6వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటలకు తెప్పోత్సవం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాకు జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో బహుమతులు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారత స్థాయి సైన్స్ ఫెయిర్‌లో బహుమతులను సాధించినట్లు జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ తెలిపారు. జగ్గయ్యపేట జీవీజే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.నాగతేజ, వై.భార్గవ ధనుష్ ఉపాధ్యాయుడు జి.చంద్రశేఖర్ పర్యవేక్షణలో ప్రదర్శించిన ప్రొటెక్టింగ్ వెహికిల్స్ అండ్ బ్రిడ్జిస్ ఫ్రమ్ ఫ్లడ్స్ అంశానికి గ్రూప్ కేటగిరీలో మూడో బహుమతి సాధించిందని పేర్కొన్నారు. గంపలగూడెం ఏపీ మోడల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్ సుదీక్ష ప్రదర్శించిన వయోవృద్ధుల కోసం ట్రాలీ రోబోట్ అంశం ఐదో బహుమతి సాధించిందని వివరించారు. బహుమతులను సాధించిన విద్యార్థులను డీఈఓ సుబ్బారావు అభినందించారని పేర్కొన్నారు.

ఓటు వేయడం అందరి బాధ్యత

జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొంది దాన్ని వినియోగించుకోవడం బాధ్యతగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం జెడ్పీ కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ స్వతంత్రం రాకముందు అందరికీ ఓటు హక్కు ఉండేది కాదని స్వతంత్రానంతరం 1950లో భారత ఎన్నికల సంఘం ఏర్పడిందన్నారు. అందరికీ ఓటు హక్కు కల్పించటంతో పాటు ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటు వేయటం పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. గత ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 65 శాతం, రాష్ట్రంలో 85, జిల్లాలో 87 శాతం పోలింగ్ నమోదైందన్నారు. అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యంపై ప్రతిజ్ఞ చేశారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు మాట్లాడుతూ ఆధార్‌ను ఏ విధంగా వినియోగించుకుంటున్నామో అలాగే ఓటు హక్కును కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్‌కుమార్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన అనంతరం సీనియర్ ఓటరు వేమూరి రత్నగిరి రావు దంపతులను సత్కరించారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. తొలుత లక్ష్మీ టాకీస్ సెంటరు నుంచి జెడ్పీ సెంటరు వరకు భారీ ర్యాలీ చేశారు. డీఈవో పీవీజె రామారావు, ఆర్‌ఐవో సాల్మన్‌రాజు, డీఎస్‌డీవో ఝాన్సీలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీవో స్వాతి తదితరులు

గణతంత్ర వేడుకలకు పటిష్ట బందోబస్తు



బందోబస్తుపై అధికారులకు సూచనలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: ఇందిరాగాంధీ స్టేడియంలో ఆదివారం ఉదయం 8.30 నుంచి 10.40 గంటల వరకు జరిగే 76వ గణతంత్ర వేడుకలకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు తెలిపారు. స్టేడియం పరిసరాలలో ఆయన శనివారం పర్యటించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమై దిశా నిర్దేశం చేశారు. స్టేడియం పరిసరాల్లో భద్రతాపరంగా ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడు, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ఉన్నతాధికారులు, పలు పాఠశాలల, కళాశాలల విద్యార్థులు వస్తారని తెలిపారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీసీపీలు తిరుమలేశ్వర రెడ్డి, ఉమామహేశ్వరరాజు, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఎస్బీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ట్రాఫిక్ ఆంక్షలు

ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని సీపీ రాజశేఖర బాబు తెలిపారు. ఆ సమయంలో కంట్రోల్ రూమ్ వైపు నుంచి బెంజిసర్కిల్ వైపునకు, రెడ్ సర్కిల్ నుంచి ఆర్టీఏ జంక్షన్‌కు, శిఖామణి సెంటర్ నుంచి వెటర్నరీ జంక్షన్‌కు వాహనాలను అనుమతించమన్నారు.

- బస్టాండ్ నుంచి బెంజిసర్కిల్‌కు ఎంజీ రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలు ఆర్టీసీ వై.జంక్షన్ నుంచి ఏలూరు రోడ్డు స్వర్ణప్యాలెస్ మీదుగా దీప్తి సెంటర్, చుట్టుగుంట, పడవలరేవు, గుణదల, రామవరప్పాడురింగ్ నుంచి బెంజిసర్కిల్‌కు ఒక మార్గంగా ఉంటుందన్నారు. ఆర్టీసీ వై.జంక్షన్ నుంచి బందర్ లాకులు, రాఘవయ్య పార్క్, పాత ఫైర్ స్టేషన్ రోడ్, అమెరికన్ హాస్పిటల్, మసీద్ రోడ్, నేతాజీ బ్రిడ్జి, గీతానగర్, స్క్యూ బ్రిడ్జి మీదుగా బెంజ్ సర్కిల్ వైపునకు వెళ్లాలి.
- బెంజిసర్కిల్ నుంచి ఎంజీ రోడ్డులోకి వచ్చే వాహనాలను ఫకీర్‌గూడెం, నేతాజీ బ్రిడ్జి, బస్టాండ్‌కు వెళ్లాలి.
- బెంజిసర్కిల్ నుంచి డీసీపీ బంగ్లా కూడలి వరకు ఎంజీ రోడ్డుపై ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆహ్వానితులను మాత్రమే అనుమతిస్తామన్నారు.
- ఐదో నంబర్ రూట్‌లో వెళ్లే బస్సులు ఏలూరు రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాలని సూచించారు.

ఆపన్నహస్తం.. రెడ్‌క్రాస్

- చావుబతుకుల్లో ఎంతోమందికి రక్తదానం
- వైపరీత్యాల్లో బాధితులకు భరోసా

గుడ్లవల్లేరు: ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం.. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ. బెడ్ మీద చావుబతుకుల్లో ఉన్న క్షతగాత్రులతో పాటు శస్త్ర చికిత్సల్లో ఉన్న ఎంతోమందికి రక్తదానం అందించి సేవా తత్పరతను చాటుకుంటోంది. కేవలం ప్రభుత్వం నిర్దేశించిన ప్రాసెసింగ్ చార్జీలతోనే ఇక్కడ ఆపదలో ఉన్నవారికి అవసరమైన రక్తాన్ని అందిస్తారు. కృష్ణా జిల్లాలో రెడ్‌క్రాస్‌తో పాటు మచిలీపట్నం జిల్లా ఆస్పత్రి, గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో బ్లడ్‌బ్యాంకులు ఉన్నాయి.

ఆపదలో బాధితులకు అండగా...

ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలకు దెబ్బతిన్న బాధితులకు తక్షణ సాయం అందించడానికి రెడ్‌క్రాస్ ముందంజలో ఉంది. ఏటా 20 నుంచి 30వరకు ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించడమే కాకుండా పేదలకు ఉచిత మందుల పంపిణీని చేస్తున్నారు. అన్ని వైద్యాలతోపాటు కంటి పరీక్షలు చేసి రెండేళ్లలో 400 కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రెండేళ్లలో 50 రక్తదాన శిబిరాలు, 25ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ రెడ్‌క్రాస్‌లో ఉన్నాయి. వాటిని రోగుల సహాయార్థం అందిస్తారు. వికలాంగులకు వీల్‌చైర్లు, రెండేళ్లలో 250మంది క్యాన్సర్ రోగులకు ఉచితంగా రక్తాన్ని అందించడం, జిల్లాలో 500మంది నిరుపేదలకు దుప్పట్లు, మురికి వాడల్లో నివసించే పేదలకు 600 కిట్ల పంపిణీ, 800 మొక్కలు నాటే కార్యక్రమాలు చేస్తున్నారు.



మచిలీపట్నంలోని రెడ్‌క్రాస్ కార్యాలయం

ఇచ్చిన రక్తం యూనిట్లలో వివరాలు ఇవి...



రక్తదానం చేస్తున్న పోలీసులు(ఫైల్)

2020	741
2021	830
2022	1,176
2023	1,190
2024	1,213

వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాల్లో ఇచ్చిన కిట్ల వివరాలు



అగ్ని బాధితులకు దుస్తుల పంపిణీ(ఫైల్)

2022	230
2023	242
2022	370

రక్తదాతకూ ఆరోగ్యమే..



ఆరోగ్యంగా ఉన్న ప్రతి వ్యక్తి ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రక్తం దానం చేస్తే శరీరంలో కొత్త రక్తం వచ్చి ఆరోగ్యంగా ఉంటారు. దాతలు ఇచ్చిన రక్తాన్ని జాగ్రత్తగా భద్రపరచి ఆపదలో ఉన్న వారికి అందజేస్తాం. రెడ్‌క్రాస్ ఎంతోమంది ప్రాణాలను ఇలా కాపాడింది.

– డాక్టర్ టి.ఎస్.ఎస్.బాలాజీ, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్

సేవ చేయడం అలవర్చుకోవాలి



ఆపదలో ఆదుకునే ఆపన్న హస్తం రెడ్‌క్రాస్. అగ్ని ప్రమాదాలు, వైపరీత్యాల్లో బాధితులకు తక్షణ సాయం మా సంస్థ ద్వారా అందుతుంది. సేవా కార్యక్రమాలను చిన్నప్పట్నించే అలవరచుకోవాలి. సమాజంలో యువత కూడా యూత్ రెడ్‌క్రాస్‌లో చేరి తమవంతు సాయాన్ని సొసైటీకి అందించాలి.

– భవిరి శంకర్‌నాథ్, జిల్లా రెడ్‌క్రాస్ సెక్రటరీ

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

గన్నవరం: స్థానిక సినిమా హాల్ సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం.. మండలంలోని బుద్దవరం గ్రామ శివారు రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గుర్రం శేషు(65) ఇళ్ల వెంట తిరుగుతూ అప్పడాలు, జంతికలు విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం సినిమా హాల్ సెంటర్ వద్ద జాతీయ రహదారి దాటుతున్న అతడిని విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేషు ఛాతి భాగంపై లారీ ముందు టైర్లు ఎక్కడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

పెనమలూరు: కానూరు 100 అడుగుల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం గన్నవరానికి చెందిన మల్లాది ప్రశాంత్ అతని అన్న శాంతికిరణ్(32)తో కలిసి కానూరు కొత్త ఆటోనగర్‌లో ఎస్ఎల్ఎన్ ఎర్త్ మూవర్ కంపెనీ పెట్టారు. అయితే శుక్రవారం శాంతికిరణ్ బైక్‌పై కంపెనీకి వెళ్లాడు. సాయంత్రం బైక్‌పై గన్నవరానికి బయలుదేరాడు. అతను 100 అడుగుల రోడ్డులో అలంకార్ బార్ దాటిన తరువాత రోడ్డుపై కుక్క అడ్డు రావటంతో బ్రేక్ వేయగా బైక్ అదుపు తప్పి అతను రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకు చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శాంతికిరణ్ శనివారం మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదలకు త్వరలో ఇళ్ల స్థలాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు అందించేందుకు కేబినెట్ ఆమోదించిందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పేదలకు ఇళ్ల స్థలాలు అందించడానికి విధి విధానాలు రూపొందించడానికి రాష్ట్ర స్థాయిలో రెవెన్యూ శాఖామంత్రి ఆధ్వర్యంలో ఒక కమిటీ, జిల్లాల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. గృహ నిర్మాణ యూనిట్ కాస్ట్ కూడా పెంచేందుకు కసరత్తు జరుగుతోందని చెప్పారు. గత టీడీపీ పాలనలో మాదిరిగానే ఇళ్లు నిర్మించుకునే ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా ఇస్తామన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందించే కార్యక్రమం లాంఛనంగా ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. అదే రోజు రాష్ట్ర వ్యాప్తంగా పూర్తయిన 1.14 లక్షల ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు తాళాలు అందజేస్తారన్నారు. పీఎంఏవై పథకంలో భాగంగా 7 లక్షల ఇళ్లను ఈ ఏడాది డిసెంబర్‌కు పూర్తి చేయాలన్న లక్ష్యంగా పని చేస్తున్నామని మంత్రి చెప్పారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు

గుడివాడరూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్‌ను శనివారం సాయంత్రం ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అజ్ఞాత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా జూదాలు, కోడిపందేలు నిర్వహించే వారిపై పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, బాలికల సంరక్షణకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శక్తి టీమ్‌లు, షీ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా సమస్యలు తలెత్తిన సమయంలో మహిళలు, బాలికలు శక్తి, షీ టీమ్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందించిన వెంటనే అక్కడికే మహిళా పోలీసులు చేరుకుని రక్షణ కల్పిస్తారని ఎస్పీ చెప్పారు. అనంతరం స్టేషన్ ఎస్ఐ చంటిబాబు పనితీరును ఎస్పీ అభినందించారు. పోలీస్ సేవలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో డీఎస్పీ వి.ధీరజ్ వినీల్, తాలూకా సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, ఎస్ఐ చంటిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



గుడివాడలో మీడియాతో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు, డీఎస్పీ ధీరజ్ వినీల్ తదితరులు

23 కేజీల గంజాయి స్వాధీనం



పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ ఎ.శ్రీనివాసరావు, చిత్రంలో నిందితులు, వారి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి

12 మంది రవాణాదారుల అరెస్ట్

విజయవాడస్పోర్ట్స్: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న 12 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు సిటీ టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుల నుంచి రూ.1.40 లక్షల ఖరీదైన 23 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. లా అండ్ ఆర్డర్ బృందాలతో కలిసి గంజాయి అక్రమ రవాణా, విక్రయం, కొనుగోలు అంశాలపై సమగ్ర దర్యాప్తు చేశామన్నారు. గతంలో పలు మాదక ద్రవ్యాల కేసుల్లో అరెస్ట్ కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితులపై నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు.

సొమ్ము పంచుకుంటుండగా పట్టివేత..

దీనిలో భాగంగానే కంకిపాడు గ్రామానికి చెందిన పెమ్మాడి మహేష్(సస్పెక్ట్ షీటర్), తెన్నేరు రోహిత్‌కుమార్, కాటూరి మహేష్, బొడ్డు ఉమేష్, గోసాలకు చెందిన పాలాన కిరణ్ (సస్పెక్ట్ షీటర్), పోరంకికి చెందిన ఖగ్గా వెంకటతరుణ్ (రౌడీ షీటర్), తాడిగడప గ్రామానికి చెందిన కొమ్మూరు సాయికిరణ్(రౌడీ షీటర్), విజయవాడ అయోధ్యనగర్‌కు చెందిన వల్లభనేని సాయిశ్రీరామ్(సస్పెక్ట్ షీటర్), భవానీపురానికి చెందిన షేక్ అక్బర్‌బాషా(సస్పెక్ట్ షీటర్), లెనిన్‌నగర్‌కు చెందిన నాదెళ్ల తరుణ్‌చౌదరి(సస్పెక్ట్ షీటర్), మురళీనగర్‌కు చెందిన షేక్ ఫాతిమా, పూర్ణానందంపేటకు చెందిన దుంగల మురళీలను అరెస్ట్ చేశామని ఏడీసీపీ చెప్పారు. వీరందరూ జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి అక్రమ రవాణా మార్గాన్ని ఎంచుకున్నారన్నారు. గతంలో అనేక సార్లు జైలు జీవితం అనుభవించినా వీరి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని, ఆంధ్రా–ఒడిశా బోర్డర్‌లోని కొందరు వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేసి విజయవాడ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. గంజాయి విక్రయించగా వచ్చిన సొమ్మును హనుమాన్‌పేట సమీపంలోని ఓ పార్క్ వద్ద పంచుకుంటున్న వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. గంజాయి సాగు, విక్రయం, సేవించడం, రవాణా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే 91211 62475 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ సీఐలు శ్రీధర్, నాగశ్రీనివాసరావు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా టోర్నీ క్వార్టర్ ఫైనల్స్‌కు ఆంధ్రా జట్లు

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) 68వ జాతీయ అండర్ – 14 సెపక్‌తక్రా బాల, బాలికల పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్లు సత్తా చాటుతున్నాయి. ఈ నెల 24న పటమట జెడ్పీ స్కూల్‌లో ప్రారంభమైన టోర్నీ.. లీగ్ పోటీలు శనివారం ముగిశాయి. 12 రాష్ట్రాల జట్లు పోటీల్లో తలపడుతున్నాయి. పూల్ – బీ నుంచి బరిలో దిగిన రాష్ట్ర బాలికల జట్టు అదే పూల్‌లోని విద్యాభారతి, బిహార్ జట్లను ఓడించి గరిష్టంగా ఎనిమిది పాయింట్లతో పూల్ విన్నర్‌గా నిలిచి క్వార్టర్స్ ఫైనల్స్‌లోకి అడుగుపెట్టింది. అదేవిధంగా నాలుగు పాయింట్లతో పూల్ – సీ రన్నర్‌గా నిలిచిన రాష్ట్ర బాలుర జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించింది.

హోరాహోరీగా..

శనివారం జరిగిన లీగ్ పోటీల్లో జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. బాలుర విభాగంలో గుజరాత్ 15–12, 15–11 పాయింట్ల తేడాతో బిహార్‌ను, ఢిల్లీ 15–7,15–13 తేడాతో జార్ఖండ్‌ను, ఆంధ్రప్రదేశ్ జట్టు 15–7, 15–9 పాయింట్స్ తేడాతో మహారాష్ట్రను ఓడించాయి. బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ 15–7, 15–4 పాయింట్స్ తేడాతో బిహార్‌ను, మణిపూర్ 15–4, 15–2 తేడాతో జార్ఖండ్‌ను, గుజరాత్ 13–15, 11–15 తేడాతో మహారాష్ట్రను ఓడించాయి. తుదకు బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్, మణిపూర్, బిహార్, ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, తెలంగాణ జట్లు, బాలుర విభాగంలో ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్, మణిపూర్, పంజాబ్, తమిళనాడు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి. ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి క్వార్టర్స్ ఫైనల్స్ పోటీలు ప్రారంభమవుతాయని స్కూల్ గేమ్స్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, సహాయ కార్యదర్శులు రాధాకృష్ణ, రాజు, టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.రమేష్ తెలిపారు.



హోరాహోరీగా తలపడతున్న క్రీడాకారులు